సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 30 । జూలై । 2023



వరద.. బురద
జిల్లా కేంద్రంలో వర్షానికి వచ్చిన వరద తాకిడి తగ్గింది. కానీ ఇళ్లలో బురద పేరుకుపోయింది. ఇళ్లలోని ఫర్నిచర్, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు, సామగ్రి పాడయ్యాయి. 9లో▸



భక్తిశ్రద్ధలతో మొహర్రం
జిల్లాలో శనివారం మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీరీలను ఊరేగించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0 /26.0
మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జలపాతానికి సందర్శకుల తాకిడి



జలపాతం వద్ద సందర్శకుల సందడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ గిరిజన గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని జలపాతం సోయగాలు ఒలికిస్తూ సందర్శకులకు కనువిందు చేస్తోంది. ర్యాలీ గ్రామ పంచాయతీకి కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ జలపాతం ఇటీవల వర్షాలతో వెలుగులోకి రాగా సందర్శకుల తాకిడి పెరిగింది. వరద నీరు పాలనురుగులా కొండపై నుంచి జాలువారుతూ విశేషంగా ఆకట్టుకుంటోంది.

బీజేపీలో మాజీ ఎమ్మెల్యేల చేరికకు రంగం సిద్ధం



సంజీవరావు



శ్రీదేవి

బెల్లంపల్లి: జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే సొత్కు సంజీవరావు కాషాయ కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ కోర్ కమిటీ సభ్యుడు గడ్డం వివేక్, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికకు మంతనాలు చేసినట్లు సమాచారం. వాస్తవానికి బీజేపీ అగ్రనేత అమిత్‌షా హైదరాబాద్ పర్యటనలో భాగంగా పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ వర్షాల వల్ల అమిత్‌షా పర్యటన అర్ధంతరంగా రద్దు కావడంతో ఈ నెల 31న ఢిల్లీకి వెళ్లి అమిత్‌షా సమక్షంలో పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపారు.

'ఎల్లంపల్లి' 20 గేట్లు ఎత్తివేత



గోదావరిలో కలుస్తున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 20 గేట్లు ఎత్తి మూడు క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. శనివారం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 15.110 టీఎంసీలతో ఉంది. నీరు దిగువకు వదులుతుండడంతో రెండ్రోజుల్లోనే 2 టీఎంసీలు తగ్గింది. ఇన్‌ఫ్లో ఎస్సారెస్పీ నుంచి 1.08 లక్షల క్యూసెక్కులు, కడెం నుంచి 8 వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి దాదాపు 1.67 లక్షల క్యూసెక్కులు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 311 క్యూసెక్కులు, 20 గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

ముంపు కాలనీల పరిశీలన



రాంనగర్‌లో పరిశీలిస్తున్న మోతిలాల్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో వరద ముంపునకు గురైన ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్, పద్మశాలి కాలనీలను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ శనివారం పరిశీలించారు. కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరి ఒక్క రోజు నిల్వ ఉండి వెళ్లిపోగా, వరదకు గురైన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆనకట్టలు.. వరద తిప్పలు!



మంచిర్యాలలోని రాళ్లవాగుకు ఆనుకుని వెలిసిన నిర్మాణాలు

- నిలువునా ముంచుతున్న గోదావరి
- మూడేళ్లుగా పెరుగుతున్న ముప్పు
- బ్యారేజీల గేట్లు ఎత్తినా.. దించినా వణుకే..
- శాశ్వత పరిష్కారం కోసం ప్రజల వేడుకోలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి నదిపై వెలిసిన ఆనకట్టలు జిల్లాకు వరద ముప్పు తెచ్చిపెడుతున్నాయి. గత మూడేళ్లుగా పట్టణాలతోపాటు నదీతీరంలో ఉన్న ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి అటు ప్రాణహిత నది ఇటు గోదావరి నది బ్యాక్ వాటర్‌తో ఉప్పొంగుతున్నాయి. దీంతో సమీప పట్టణాలకు వరద పోటెత్తుతోంది. జిల్లా కేంద్రం మంచిర్యాలలో రాళ్లవాగు, నస్పూర్‌లో తోళ్లవాగు బ్యాక్ వాటర్‌తో ఈ రెండు పట్టణాలకు సమస్య ఎదురవుతోంది. వీటితోపాటు జైపూర్ మండలం గోదావరి తీర ప్రాంతాలు, చెన్నూర్ పట్టణానికి ముప్పు పొంచి ఉంటోంది. అటు వరదలతో గత మూడేళ్లుగా రైతులు పంట నష్టపోతూనే ఉన్నారు.

గేట్లు ఎత్తినా.. దించినా దడే

ఎగువన గోదావరి నదిపై ఉన్న శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులు నిండితే దిగువకు నీరు వస్తాయి. మొదట ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుతాయి. 20టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ఈ ప్రాజెక్టుకు 16టీఎంసీల నుంచే నీటిని విడుదల చేస్తుంటారు. దిగువన సుందిళ్ల, ఆ కింద అన్నారం, ఆ తర్వాత కాళేశ్వరం బ్యారేజీలు ఉన్నాయి. ఎల్లంపల్లి వరద ఆధారంగానే దిగువన బ్యారేజీల గేట్లు ఎత్తడమో.. దించడమో చేస్తుంటారు. వరుసగా రెండ్రోజులు అధికంగా వర్షాలు కురిస్తే ఇటు ఎగువన ప్రాజెక్టుల గేట్లు ఎత్తితే సమీప ప్రాంతాలపై ప్రభావం ఉంటుంది. అధికారులు ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసినా వరదను ఎవరూ ఆపలేకపోతున్నారు. మూడు రోజులు క్రితం ఎల్లంపల్లికి భారీగా వరద నీరు, మరోవైపు వర్షాలతో జిల్లా కేంద్రంలో రాళ్లవాగు ఆనుకుని ఉన్న కాలనీలు వణికిపోయాయి. ముందస్తుగా ముందస్తుగా నది ఒడ్డున ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఖాళీ చేయించడంతో పెద్ద ముప్పు తప్పింది. ఎన్టీఆర్ కాలనీ, రామ్‌నగర్, ఎల్ఐసీ, తదితర కాలనీల్లో ప్రజలు వానాకాలం వచ్చిందంటే భయంతో వణకుతున్నారు.

ఆగని నిర్మాణాలు

ఓ వైపు వరదలతో ముంపు ఉన్నప్పటికీ యథేచ్ఛగా వాగులు, కుంటల బఫర్, కోర్ తేడా లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. గత ఏడాదే లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మళ్లీ షరా మామూలే అన్నట్లుగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. ముంపు ప్రాంతాల్లో సరైన ప్రణాళిక లేక ఇష్టారీతిన వెలుస్తున్న కొత్త నిర్మాణాలతో పాత కాలనీలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇక పట్టణాల్లో ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురి కావడంతో చిన్నపాటి వర్షానికే పొంగిపోయి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వరదలతో దిగువన ఉండే వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. గతేడాది రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఈసారి వర్షం తగ్గుముఖం పట్టడంతో నష్టం ఎక్కువ లేదు.

పరిష్కారమెలా?

కాళేశ్వరం బ్యాక్ వాటర్‌పై గత ఏడాది ఫిర్యాదులు చేస్తే, సాగునీటి ఉన్నతాధికారులు అధిక వర్షాలతో ఇలా జరిగిందని సమాధానం ఇచ్చారు. గత ఏడాది కంటే ఈసారి వానలు తక్కువగానే ఉన్నాయి. అయినా వరదలొచ్చాయి. దీంతో బ్యారేజీల నిర్మాణంతోనే అధికంగా నష్టం జరుగుతోందనే వాదనలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలపై ఇప్పటికీ స్పష్టమైన ప్రణాళిక ప్రకారం సాగకపోవడమే ప్రధాన లోపంగా మారింది. నస్పూర్ వంటి ప్రాంతాల్లోనూ నిబంధనలు గాలికి వదిలేసి కట్టేస్తున్నారు. వాగులు, చెరువులు, కుంటలు, బఫర్ జోన్లను కబ్జా చేస్తున్నారు. పట్టణాల్లో ఉన్న చెరువుల ఆక్రమణలను తొలగించాల్సి ఉన్నా జాప్యం జరుగుతోంది. రాళ్లవాగు ఇరువైపులా నిర్మాణాలు రాకుండా ఆపాల్సి ఉంది. నాలాలను పటిష్టపర్చాలి ఉంది. లోతట్టు ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలకు అనువుగా లేకుంటే అనుమతులు ఇవ్వకుండా, గోదావరి ఒడ్డున ఉన్న వారికి నష్టం వాటిల్లకుండా శాశ్వత పరిష్కారం వెతకాలి. ఇందుకోసం నిపుణులతో సర్వేలు చేయించి భవిష్యత్తులో మరిన్ని నష్టాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టంపై నివేదిక ఇవ్వండి

- ముందు జాగ్రత్త చర్యలతో ప్రాణనష్టం జరగలేదు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సుమన్

చెన్నూర్: భారీ వర్షాలతో నియోజకవర్గంలో జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్‌లతో కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం బతుకమ్మ వాగు వంతెనతోపాటు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పంట నష్టంపై నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ముందు జాగ్రత్త చర్యలతో వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఆస్తి నష్టం తక్కువగా ఉందని, దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ లైన్లను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పునరుద్ధరించామని చెప్పారు. నియోజకవర్గంలో వేల కోట్ల నిధులతో 18వంతెనలు నిర్మించామని, చెన్నూర్ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు చిల్లరమల్లర విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మహేశ్, సీఐ వాసుదేవరావు, చెన్నూర్, కోటపల్లి మండలాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చంద్రబాబు పెంపుడు కుక్క..!

రేవంత్‌రెడ్డి చంద్రబాబు పెంపుడు కుక్క అని, ఓ దొంగ చేతిలో కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని బాల్క సుమన్ ఘాటుగా విమర్శించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన సమయంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ''రేవంత్‌రెడ్డి ఒళ్లు దగ్గరపెట్టుకో నాలుక చీరేస్తాం..'' అని హెచ్చరించారు. రైతులకు మూడు గంటల విద్యుత్ చాలని, ధరణి ఎత్తివేస్తామనే కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

విప్‌కు నిరసన సెగ

చెన్నూర్‌లోని బతుకమ్మ వాగు, పంట చేలను పరిశీలించి వస్తున్న విప్ సుమన్‌కు జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ వద్ద రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. గత నాలుగేళ్లుగా కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంట చేలన్నీ నీట మునిగి నష్టపోతుండగా ఇప్పటివరకు పరిహారం ఇప్పించలేదని అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటి పాలయ్యాయని, ఏటా పంటలను పరిశీలిస్తున్నారే తప్పా పరిహారం ఇప్పించడం లేదని నిలదీశారు. నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని విప్ రైతులకు హామీనిచ్చి వెళ్లిపోయారు.

నాలుగేళ్లుగా రైతులకు నష్టమే..



చెన్నూర్ గోదావరి నది పరీవాహక ప్రాంతంలో నీటి మునిగిన పత్తి పంట

రెండేళ్లుగా నష్టపోతున్నా..



గత ఏడాది వరదలకు పంట నష్ట పోయాను. ఈయేడు ఆరు ఎకరాల్లో పత్తి వేశా. వరద ముంపుతో పంటంతా నాశనం అయ్యింది. రెండేళ్ల నుంచి పంట నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి పరిహారం అందడం లేదు. ఈసారైనా ప్రభుత్వం కరుణించి పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలి.

– పంది్ళ్ల రాంరెడ్డి, రైతు, గ్రామం: పొక్కూర్, మం: చెన్నూర్

- కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలు నీటి పాలు
- పరిహారం కోసం ఎదురుచూపులు

చెన్నూర్: కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో చెన్నూర్ ప్రాంతంలోని గోదావరి నది పరీవాహక ప్రాంత రైతులు నాలుగేళ్లుగా నష్టపోతూనే ఉన్నారు. పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ ఏడాది ఇప్పుడిప్పుడే పత్తి మొలకెత్తగా వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెన్నూర్ మండలం సుందరశాల, వెంకంపేట, పొక్కూర్, భీరెల్లి రాయిపేట, చెన్నూర్, నారాయణపూర్ అక్కెపల్లి, చింతలపలి, కోటపల్లి మండలం రాపన్‌పల్లి, ఎర్రాయిపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టగా.. ఆదిలోనే కోలుకోలేని దెబ్బతగిలి లబోదిబోమంటున్నారు. ఎకరం పంట సాగుకు రూ.25 వేలు ఖర్చవుతుండగా.. గత నాలుగేళ్లుగా భారీ వర్షాలకు ఆయా మండలాల్లో పంటలు ముంపునకు గురై రూ.కోట్లు నష్టపోయారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిహారం ఇస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు.

గత ఏడాది చెన్నూర్, కోటపల్లి మండలాల్లో నష్టాపోయిన పత్తి పంట..

మండలం	సంవత్సరం	రైతులు	పంట ఎకరాల్లో
కోటపల్లి	2022	2833	6486.5
చెన్నూర్	2022	2610	5400
మొత్తం		5540	1188.5

గత మూడేళ్ల క్రితం పంట నష్టం వివరాలు

మండలం	సంవత్సరం	రైతులు	ఎకరాల్లో
కోటపల్లి	2019	1351	1554.625
కోటపల్లి(ఫిబ్రవరి)	2020	133	115.07
కోటపల్లి(ఆగస్టు, సెప్టెంబర్)	2020	1664	4789.05
చెన్నూర్	2019	839	1182.22
చెన్నూర్	2020	107	168.50



పులుల పాత్ర కీలకం

- జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్‌సింగ్



ర్యాలీని ప్రారంభిస్తున్న అటవీ అధికారి

మంచిర్యాలక్రైం: అడవుల సంరక్షణలో పులులు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్ అన్నారు. అంతర్జాతీయ పులల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా అటవీశాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో పులులు ఉంటే అటవీ సంపద అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వినయ్‌కుమార్ సాహు, డిప్యూటీ ఆర్‌ఓలు పీ.సంతోష్, సాగరిక, ఎఫ్ఎస్ఓలు రామ్‌సింగ్, రామకృష్ణ సర్కార్, విజయలక్ష్మి, రేపతిరెడ్డి, ఎఫ్‌బీఓలు వెంకటేశ్వర్లు, నాగమణి, రాజేశ్వరి, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

దండేపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు సూచించారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రం రిజిష్టర్లు, రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశీలించారు. అనంతరం మండలంలోని ధర్మారావుపేటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడడంతోపాటు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. మండల వైద్యాధికారి సతీష్, పల్లె దవాఖాన వైద్యురాలు అభిఘ్న, హెల్త్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వరద ప్రాంతాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించి, బాధితులకు ఆర్ ఆర్ ప్యాకేజీని ప్రకటించాలని, వరదలు రాకుండా రాళ్ల వాగుపై కరకట్టను నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మూడేళ్లుగా వరదలు వస్తున్నాయని, కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో మునిగిపోతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, పద్మశాలి కాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్, సాయికుంట కాలనీలు మునిగి లక్షల ఆస్తి నష్టం సంభవిస్తోందని అన్నారు. బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పానుగోటి రంగారావు, పెద్దపల్లి పురుషోత్తం, తులా ఆంజనేయులు, బోయిని హరికృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలతో అభివృద్ధికి బాటలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: దీర్ఘకాలం నుంచి ఎదురుచూస్తున్న ఇళ్లపట్టాల పంపిణీతో బెల్లంపల్లి అభివృద్ధికి బాటలు పడుతున్నాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 21, 31వ వార్డుల్లో ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా పుర ప్రజలు ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని, ఇన్నాళ్లకు ఆ సమస్య తీరిందని తెలిపారు. ఇళ్ల పట్టాలు ఇప్పించిన సీఎం కేసీఆర్‌కు బెల్లంపల్లి పుర ప్రజలు రుణపడి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాలు జారీ చేస్తుండడంతో సొంతభూమిలో అనేక మంది పక్కా గృహాలు నిర్మించుకుంటున్నారని అన్నారు. బెల్లంపల్లి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు రాజనాల కమల, గెల్లి రాజలింగు, అశోక్, గోషిక రమేష్, కృష్ణ, టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, టీబీజీకేఎస్ నాయకుడు బడికెల రమేష్, నాయకులు భీమాగౌడ్, రమేష్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముంపు కాలనీల్లో పారిశుధ్య పనులు



మంచిర్యాలటౌన్: వరద నుంచి కోలుకున్న ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్, పద్మశాలీ కాలనీల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. వరద నీటితో ఇళ్లు, కాలనీలు మునిగి తేరుకోగా, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో, ముందస్తుగా చర్యలు చేపట్టారు. వరద ముంపు కాలనీల్లోని ప్రజలకు ఇంటింటికీ బ్లీచింగ్ పౌడర్ అందించగా, రాంనగర్‌లో వార్డు కౌన్సిలర్ కొండ పద్మ ఆధ్వర్యంలో కాలనీలోని చెత్తాచెదారాన్ని తొలగించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొల్లూర్ గోదావరి నది ప్రవాహంలో గుర్తు తెలియన మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బురదలో చిక్కుకున్న తహసీల్దార్ కారు



రాంనగర్‌లోని బురదలో చిక్కుకున్న కారు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్‌లోకి వచ్చిన వరదనీరు ఇళ్ల మధ్యలోకి చేరడంతో ఆ ప్రాంతం మొత్తం బురదగా మారింది. ఆయా ప్రాంతాలను పరిశీలించేందుకు తహసీల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌లో తహసీల్దార్ కారులో బయలు దేరారు. తిరుగు ప్రయాణంలో వారి కారు రోడ్డు పక్కనే ఉన్న బురదలో కూరుకుపోయింది. ఆ వాహనాన్ని బయటకు తీసేందుకు గంటన్నరకు పైగా ప్రయత్నించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వరద వల్ల ఎంత మేర బురద కాలనీలోకి వచ్చి చేరిందో అర్థమవుతోంది.



పెట్రోల్ అరక..!



పెట్రోల్ అరకతో గడ్డి తొలగిస్తున్న శేక్ అయ్యూబ్

- బైక్, ఆటో పరికరాలతో తయారీ
- ఎకరాకు లీటరు పెట్రోల్ చాలు
- కెరమెరి యువకుడి వినూత్న ఆలోచన

కెరమెరి(ఆసిఫాబాద్): పంట చేలలో అరక దున్నాలంటే ఎడ్లు ఉండాలి. రైతు కూడా అవసరమే. ఎడ్ల సంఖ్య తగ్గి ప్రస్తుతం అరక దున్నాలంటే ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం సుల్తాన్‌గూడకు చెందిన శేక్ అయ్యూబ్ వినూత్న ఆలోచనతో పెట్రోల్ అరక రూపొందించాడు. మూడు మాసాల శ్రమతో పెట్రోల్‌తో నడిచే అరక సిద్ధమైంది. పనికి రాని మోటార్‌సైకిల్, ఆటో పరికరాలతో పెట్రోల్‌తో నడిచే అరకను తయారు చేశాడు. మోటార్ బైక్‌లాగానే దీన్ని నడపవచ్చు. చేతుల్లోనే ఎక్స్‌లేటర్, క్లచ్, గేర్లు ఉంటాయి. కిక్ కొడితే స్టార్ట్ అవుతుంది. నాలుగు గేర్లు ఉండడంతో హైస్పీడ్‌లో కూడా దున్నవచ్చు. ఛేసిస్, ఇంజన్, నాలుగు గేర్లు, ఎక్స్‌లేటర్, క్లచ్ షాఫ్స్ మోటార్ బైక్‌కు సంబంధించినవి కాగా.. టైర్లు ఆటోకు సంబంధించినవి. గాలిలో పొగ వెళ్లేందుకు సైలెన్సర్ బిగించాడు. ఈ పెట్రోల్ అరక తయారీ రూ.40 వేలు ఖర్చు చేశాడు. పొలంలో అరక పడుతూ గడ్డిని తొలగిస్తున్నాడు. వాస్తవంగా ఒక ఎకరం దున్నడానికి(గడ్డిని తొలగించేందుకు) రైతులు ప్రస్తుతం రూ.1500 చెల్లిస్తుండగా.. ఈ పెట్రోల్ అరకకు ఒక లీటరు పెట్రోల్ సరిపోతుంది. ఒక ఎకరాన్ని మూడు గంటల్లో దున్నవచ్చు. దీనికయ్యే ఖర్చు రూ.110 మాత్రమే. అంటే ఈ యంత్రంవల్ల ఒక రైతు ఎకరానికి రూ.1390 ఆదా చేయవచ్చు.

శ్రమ ఫలించింది

అరకలకు రూ.వేలు ఖర్చు పెడుతున్నాం. వ్యవసాయానికి ఖర్చు తడిసి మోపడవుతోంది. దీంతో ఖర్చు తగ్గించేందుకు వినూత్న ఆలోచన చేశారు. మూడు మాసాలుగా సుదీర్ఘంగా ఆలోచించి వారం రోజుల క్రితం దీన్ని తయారు చేశాను. నేను పడ్డ శ్రమ ఫలించింది, అరక ఎడ్లు, కూలీ మనిషి లేకుండా ఎంచక్కా ఈ పెట్రోల్ వాహనంతో పొలంలో అరక పడుతున్నా. సుమారు రూ.40 వేలు ఖర్చు అయింది. – శేక్ అయ్యూబ్, సుల్తాన్‌గూడ

మూడవ రోజు రాకపోకలు బంద్

- రెండు అంతర్రాష్ట్ర రహదారుల్లో నిలిచిన రాకపోకలు
- మూడు మండలాలకు సైతం..
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



హుడ్కిలి లోలెవల్ వంతెన వద్ద వరదలో మునిగిపోయిన లోలెవల్ వంతెన



వరదలో మునిగిన పారిగాం వంతెన

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు మూడు రోజులుగా మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండలం మీదుగా ఉన్న సిరూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల గుండా మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్ర గ్రామాలకు, పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ప్రతీ రోజు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్, తహసీల్దార్ రియాజ్ అలీల ఆధ్వర్యంలో పెన్‌గంగపై ఉన్న వంతెన హుడ్కిలి లోలెవల్ వంతెనలపై భారీ బందోబస్తును ఏర్పాటు చేసి ప్రమాదకర ప్రయాణాలు సాగించకుండా రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.

సిర్పూర్(టి)–కౌటాల, చింతలమానెపల్లి మండలాలకు...

భారీ వర్షాలకు సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారి గుండా రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని పారిగాం గ్రామం వద్ద ఉన్న వాగుపై ఉన్న వంతెన పూర్తిగా వరదనీటిలో మునిగిపోవడంతో ఈ రహదారి గుండా ప్రయాణాలు నిలిచిపోయాయి. దీంతో సిర్పూర్(టి) మండలంలోని పారిగాం, లోనవెల్లి, కర్జపల్లి, కంచర్‌పేట్, కోనేరు కాలనీ, డోర్‌పల్లి గ్రామాలతో పాటు కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి గుండా ప్రమాదకర ప్రయాణాలు సాగించకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ నెల 30, 31, ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల వివిధ పేపర్లు, పీజీ కోర్సులకు నా లుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు ఏమాత్రం తీసిపోకుండా కాంట్రాక్ట్ కార్మికులు అన్ని పనులు చేస్తున్నారని, అయితే వారికి కనీస సౌకర్యాల కల్పనలో యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. జేబీసీసీఐలో జరిగిన అగ్రిమెంట్లను కోలిండియాలో అమలుచేస్తుండగా సింగరేణిలో మాత్రం అమలుచేయటం లేదన్నారు. సమానపనికి సమాన వేతనాలు చెల్లించడంతో పాటు లాభాలలో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేష్, ముత్యాల వెంకటేష్, శంకర్, నిరంజన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు మాట్లాడుతూ ఆర్‌వోబీ నిర్మాణానికి 2013లో నిధులు మంజూరైనా ఇప్పటివరకు పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. రైల్వేగేటు వల్ల అత్యవసర పనుల నిమిత్తం మంచిర్యాల వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా వేసిన రోడ్డు పూర్తిగా బురదమయమై ప్రజలు నానా ఇక్కట్ల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్‌వోబీ పనులు పూర్తి చేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మేకల శ్రీనివాస్, మెట్టు సుధాకర్, కొట్టెరాజయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికలోడు.. మితిమీరిన వేగం



బొగ్గులోడుతో వెళ్తున్న టిప్పర్

మందమర్రిరూరల్: సింగరేణి గనుల్లో నుంచి వెలికితీసిన బొగ్గును టిప్పర్లలో ఇష్టానుసారంగా నింపుకుని రహదారిపై అత్యంత వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ప్రతిరోజు వందలాది టిప్పర్లు ఆయా గనుల నుంచి బొగ్గు లోడ్‌తో మందమర్రి కోల్‌బెల్ట్ రహదారిపై రామకృష్ణాపూర్ సీఎస్పీ వరకు రవాణా చేస్తాయి. బొగ్గు టిప్పర్‌లో బాడీ లెవల్‌గా నింపి తరలిస్తున్నప్పుడు చేస్తున్నప్పుడు బొగ్గు పెళ్లలు జారిపడకుండా కవర్లు కప్పాలి. కానీ నిత్యం వందలాది లారీల్లో నిబంధనలు పాటించకుండా బొగ్గు రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

లక్ష్మీపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

- చెన్నూర్ వ్యాపారికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన వ్యాపారి నవీన్ గయోత్

కోటపల్లి: మండలంలోని జాతీయ రహదారి లక్ష్మీపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో చెన్నూర్ పట్టణానికి చెందిన వ్యాపారి నవీన్ గయోత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూర్ పట్టణానికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం సిరోంచకు వెళ్లి చెన్నూర్‌కు వస్తుండగా లక్ష్మీపూర్ గ్రామానికి సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే పనిలో ఉన్నామని ఎస్సై సురేశ్ తెలిపారు. లక్ష్మీపూర్‌లోని జాతీయ రహదారిపై పక్కనే అక్రమంగా వెలిసిన బెల్ట్‌షాపులో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారులోని వారు మద్యం సేవించినట్లు సమాచారం.

మీడియా సంస్థలపై నిషేధం వెనక్కి తీసుకోవాలి



బచ్చలి ప్రవీణ్‌కుమార్

పాతమంచిర్యాల: మీడియా సంస్థలపై నిషేధం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన డీఈవోల సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలను విద్యా సంస్థల్లోకి రానివ్వద్దని ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు బయట పడకుండా ఉండేందుకు ప్రభుత్వం డీఈవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టమవుతుందన్నారు. విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించకుండా మన ఊరు మన బడి పేరుతో రూ.7200 కోట్లు కేటాయించి రూ.400కోట్ల పై చిలుకు నిధులు ఖర్చుపెట్టడమే ప్రభుత్వ విద్యపై పాలకుల చిత్తశుద్ధి కనిపిస్తుందన్నారు.

పదహారేళ్లకు తల్లి చెంతకు తనయుడు



తల్లి, బాబాయ్, పిన్నీతో మహేందర్ బింద్

బెల్లంపల్లి: పద్నాలుగేళ్ల వయస్సులో తప్పిపోయిన బాలుడు పదహారేళ్ల తర్వాత తల్లి చెంతకు చేరాడు. చిన్నతనంలోనే దూరమైన కొడుకు ఇక తమకు దొరకడేమోనని నిత్యం కన్నీటి పర్యంతమైన ఆ తల్లికి ఎదిగిన కొడుకు దరిచేరడంతో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజీపూర్ జిల్లా మహ్మదాబాద్ తహసీల్ పరిధిలోని యూసుఫ్‌పూర్ గ్రామానికి చెందిన సంత్రదేవి, మున్నాకుమార్ బింద్ దంపతులకు నలుగురు కుమారులు, కూతురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు మహేందర్ బింద్ అలియాస్ మనోజ్‌ను చిన్నతనంలో దగ్గరి బంధువు ముంబయి తీసుకెళ్లి హోటల్‌లో పనికి కుదిర్చాడు. కొద్ది రోజుల తర్వాత హోటల్‌లో పని మానేసి వెళ్లిపోయాడు. ఆ క్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివ్‌కుమార్ యాదవ్ అనే యువకుడికి తారసపడ్డాడు. తనదీ అదే రాష్ట్రమని, పని కోసం వెతుకుతున్నానని మహేందర్ బింద్ చెప్పడంతో వెంట తీసుకొచ్చి బెల్లంపల్లిలోని బేకరీలో పనికి కుదిర్చాడు. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తుండగా ఓ రోజు ఇంటిపై ధ్యాస మళ్లి బేకరీ యజమాని సుశీల్‌కుమార్ యాదవ్‌కు తన ఇంటి అడ్రస్ కనుక్కోవాలని కోరాడు. దీంతో సుశీల్‌కుమార్ ఆ రాష్ట్రంలోని తన బంధువులకు చెప్పి ఆరా తీశాడు. ఘజీపూర్ జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యూసుఫ్‌పూర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వివరాలు ఇచ్చారు. దీంతో తల్లి సంత్రదేవి, బాబాయ్ కమలేష్‌బింద్, పిన్నీ బసంత్ బింద్ శుక్రవారం బెల్లంపల్లికి చేరుకున్నారు.

ఆపరేషన్ చేసిన గాయం చూసి...

కొడుకును వెతుక్కుంటూ రాష్ట్రాలు దాటొచ్చిన తల్లి అతడిని చూసి ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురైంది. కొడుకూ కన్నీటి పర్యంతమయ్యాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నతనంలో గొంతుకింద చేసిన ఆపరేషన్ గాయాన్ని పరిశీలించి మహేందర్ బింద్ తన కొడుకేనని సంత్రదేవి మురిసిపోయి ముద్దాడింది. కుటుంబసభ్యులను కలిసేలా చేసిన బేకరీ షాప్ యజమాని సుశీల్ కుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహేందర్ బింద్ తల్లి, బంధువులతో కలిసి రైలులో ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరి వెళ్లాడు.

భారీ వర్షాలకు ప్రజలు చస్తుంటే..

- ప్రగతిభవన్‌లో కేసీఆర్ రాజకీయాలు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు చస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లలో రాజకీయాలు చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల లేనిదే మంత్రులు, అధికార యంత్రాంగం బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉందన్నారు. బెజ్జూర్ ఇన్‌చార్జి సర్పంచ్ 6 లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేసి రూ.12 లక్షల నిధులు డ్రా చేశారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిర్పూర్‌లో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మణిపూర్ మారణహోమాలపై ప్రధాని నోరు విప్పాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి బీఎస్పీ నాయకులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్, పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్, నాయకులు గణేశ్, విజయ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విరిసిన విద్యా కుసుమాలు



విద్యార్థులను అభినందిస్తున్న కౌన్సిలర్ మేకల దాసు

- కార్మిక వాడల నుంచి కాన్పూర్ ఐఐటీకి..
- సెంట్రల్ యూనివర్సిటీలోనూ సీటు

శ్రీరాంపూర్: విరిసిన విద్యాకుసుమాలు సింగరేణి కార్మిక ప్రాంతానికి పేరుతెచ్చాయి. శ్రీరాంపూర్ కార్మికవాడలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో సీట్లు సాధించి శభాష్ అనిపించారు. శ్రీరాంపూర్‌లోని 17వ వార్డు హిమ్మత్‌నగర్‌కు చెందిన బోయ రమేశ్, వసంత దంపతుల కుమారుడు అనుదీప్ కాన్పూర్‌లోని ఐఐటీలో సీటు సాధించాడు. ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్ మొదటి రౌండ్‌లోనే బయోటెక్నాలజీ కోర్సులో సీటు లభించింది. బీటెక్ పూర్తి చేసిన తరువాత పరిశోధన వైపు వెళ్లి శాస్త్రవేత్తను అవుతానని అనుదీప్ తెలిపాడు. ఇదే ప్రాంతానికి చెందిన చింతన నర్సింగం, లత దంపతుల కూతురు సిరి సెంట్రల్ యూనివర్సిటీ బిలాస్‌పూర్ కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో సీటు సాధించింది. సివిల్స్ రాసి ఐఏఎస్‌ను అవుతానని సిరి పేర్కొంది. విద్యార్థులను స్థానిక కౌన్సిలర్ మేకల దాసు శనివారం తన కార్యాలయంలో అభినందించారు. మరింత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు. గాదాసి రాజు, శ్రీనివాస్, నరేశ్, దాసరి సురేశ్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత



మొలక దశలోనే మునిగిపోయిన పత్తి పంట

వేమనపల్లి: ఎగువన ఉన్న ప్రాణహిత ఉప నదుల నుంచి వరద తాకిడి పెరగడంతో ప్రాణహిత నదిలో వరద ఉధృతి పెరుగుతోంది. దీనికి తోడు దిగువన గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో వరద నీరు కిందికి వెళ్లలేకపోతోంది. దీంతో ప్రాణహిత పుష్కరఘాట్, రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. ముల్కలపేట, రాచర్ల మధ్యన నిర్మాణంలో ఉన్న బొందచేను ఒర్రె వంతెన పై నుంచి వరద ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. రాచర్లతో పాటు కోటపల్లి మండలం నుంచి వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. స్థానిక జాలర్లు నాటుపడవలు ఏర్పాటు చేసిన వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని అధికారులు నాటుపడవల ప్రయాణాన్ని నిలిపివేశారు. బ్యాక్ వాటర్‌తో వందల ఎకరాల్లో పంట మొలక దశలోనే వరదపాలైంది.

పెట్రోల్‌కు బదులు నీళ్లు..

- ఆందోళనకు దిగిన వాహనదారులు



బాటిల్‌లో నీరు చూపిస్తున్న వాహనదారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్లు రావడంతో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... వాహనదారులు శనివారం హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తమ వాహనాల్లో పెట్రోల్ పోసుకొని కొంత దూరం వెళ్లగానే వాహనాలు ఆగిపోయాయి. దీంతో మెకానిక్‌లను సంప్రదించగా ఇంజన్‌లోకి పెట్రోల్‌కు బదులుగా నీళ్లు చేరాయని తెలిపారు. వాహనంలోని పెట్రోల్‌ను తీసి పరిశీలించగా నీరు ఉండడంతో కల్తీ జరిగినట్లు గుర్తించారు. పెట్రోల్‌ను బాటిల్లో తీసుకుని వాహనదారులు వందల సంఖ్యలో బంక్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో బ్లూ కోర్ట్ సిబ్బంది జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమనిగించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది మా తప్పిదం ఏమి లేదని ట్యాంకర్ వచ్చి బంక్‌ల్లో పెట్రోల్ పోసి వెళ్లిపోయిందని తెలుపడం గమనార్హం. మరి పెట్రోల్ కల్తీ ఎక్కడ జరిగిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. జరిగిన పొరపాటుకు వాహనదారుల బండి నంబర్లు ఫోన్ నంబర్ రాసుకుని మళ్లీ ఎంత పెట్రోల్ పోయించుకున్నారో అంత పోసేందుకు ఒప్పందం చేసుకోవడంతో ఆందోళన సద్దుమనిగింది.